క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగాలపై ఉచిత మోడల్ టెస్ట్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన, ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేల నగదు, ఉచిత కోచింగ్, ద్వితీయ బహుమతి రూ.1500, ఉచిత కోచింగ్ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ తనిఖీ

మైదుకూరు : మండలంలోని అక్కులాయపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు, కుష్టు, టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్, డీపీఎంఓ లక్ష్మీపతి, టీబీ కో–ఆర్డినేటర్ శంకర్, సీహెచ్‌ఓ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని నానుబాలపల్లెలో శుక్రవారం ఓ ఇంటిలో నిల్వ ఉంచిన 24 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఖాజీపేటకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి మైదుకూరులో నివాసం ఉంటూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణాకు నిల్వ చేసినట్టు అర్బన్ ఎస్‌ఐ మద్దిలేటి తెలిపారు. శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

దువ్వూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సమీర మాట్లాడుతూ ప్రభుత్వం రెండు పర్యాయాలు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్లు గల పిల్లలకు ఆల్‌బెండజోల్ సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్లున్న వారికి ఒక మాత్ర మింగించాలని సూచించారు. 34 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, దీనికి కారణం నులిపురుగులేనని పేర్కొన్నారు. ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థికి ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించాలని సూచించారు. వంద శాతం విద్యార్థులకు మాత్రలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై ప్రజల్లో అవగాహన పెరగాలని జన విజ్ఞాన వేదిక పట్టణాధ్యక్షుడు డాక్టర్ శివారెడ్డి, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన పత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కువగా ఈ ఫ్లూ వేరియెంట్ ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గొంతు నొప్పి, 3 నుంచి 5 రోజులు జ్వరంతోపాటు మూడు వారాలు దగ్గు ఉంటుందని తెలిపారు. హ్యాండ్ వాష్ చేసుకోవాలని, మాస్క్ ధరించాలని, గుంపులకు దూరంగా ఉండాలని, నీరు ఎక్కువ తాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా నాయకురాలు ఉషారాణి, పోలంకి శ్రీరాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరి, చంద్రశేఖర్ రావు, లోకేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 15 పోలింగ్ బూత్‌లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఒక బూత్‌ను పట్టణంలో ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్లు సుదర్శన్, సతీష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం




రామరాజుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మాసీమబాబు, ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం ఉధృతంగా సాగుతోంది. నగరంలోని అన్ని డివిజన్లలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. 48వ డివిజన్‌లోని రామరాజుపల్లెలో కడప నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మాసీమ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు.

- 23వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో నాగరాజుపేట, బేల్దారి వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంచి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, జ్యోతి, సుశీలమ్మ, పద్మ, సాబీరా, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.
- కడప నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ అండ్ పీజీ కళాశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కళాశాలలోని అధ్యాపకులు, పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.
- నగరంలోని మూలవంక, ఇందిరానగర్ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సంపత్, చైతన్య తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాంధీ నగర్ స్కూల్, చంద్రమౌళి స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, ప్రకాష్ నగర్ సచివాలయం, పీఎఫ్ కార్యాలయం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ బ్యాంకుల్లో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరారు.

గంగమ్మ బోనాల పండుగ ప్రారంభం



విశేష అలంకారంలో శ్రీ గంగాదేవి

కడప కల్చరల్ : కడప నగరం రాజారెడ్డివీధి మారుతి నగర్‌లోని గ్రామదేవత గంగమ్మ ఆలయ వార్షిక బోనాల పండుగ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు చామంచి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుంచి స్థానిక భక్తులు 108 పసుపు నీటి బిందెలతో అమ్మవారి మూలమూర్తిని అభిషేకించారు. అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి నవగ్రహాల పూజ, లోక కల్యాణార్థం శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్థానిక భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 316 జ్యోతులతో కనుల పండువగా అలంకరించారు. నగర మేయర్ కె.సురేష్ బాబు ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనచే పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవాలు శని, ఆదివారాలలో కూడా నిర్వహిస్తామని, ప్రత్యేకించి ఆదివారం బోనాల పండుగ ఉంటుందని చామంచి వెంకట సుబ్బయ్య వివరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ మహబూబ్‌ఆలీ తెలిపారు. ఈ శిబిరంలో రూ. 2 వేల విలువగల థైరాయిడ్, కొలెస్ట్రాల్, షుగర్, బీపీ లాంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్యం అందజేస్తామన్నారు. వారం రోజులకు సంబంధించి మందులను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. కావున ఈ వైద్య శిబిరాన్ని కడప నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఆదర్శం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థిని, మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఆదర్శమని ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం నబీకోటలోని బ్లూబెల్స్ పాఠశాలలో పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లూబెల్స్ పాఠశాల హెడ్‌మాస్టర్ అమరావతి, బ్లూబెల్స్ పాఠశాల ఇన్‌చార్జి రాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న, ప్రగతిశీల మహిళా సంఘ నాయకులు మీనాక్షి, ఉపాధ్యాయులు షాహతాజ్, శ్రావణి, సుజాత, సావిత్రి, పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం పాఠశాల స్థాపన

కడప వైఎస్సార్ సర్కిల్ : భారతదేశానికి స్వాతంత్య్రం రాకముందే మహిళల కోసం సావిత్రిబాయి పూలే పాఠశాలలను స్థాపించారని డీసీసీ అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ఇందిరా భవన్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్‌గౌడ్, ప్రసన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీ ఆధ్వర్యంలో..

నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సూచన మేరకు శుక్రవారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో కార్య నిర్వాహణ కార్యదర్శి బాలయల్లారెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సత్యరాజు, రెడ్డెయ్య, శంకరయ్య, వెంకటసుబ్బయ్య, ప్రభాకర్‌తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కడప కల్చరల్ : కడప రెడ్డిసేవా సమితి హాస్టల్ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలో మహిళలకు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, సంస్థ ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు వ్యాసరచన పోటీ ఉంటుందని, విలువలతో కూడిన విద్య అనే అంశంపై రెడ్డి సేవా సమితి పక్కనగల శివశివాని పాఠశాలలో యువతులు, మహిళలు వ్యాసం రాయాల్సి ఉంటుందని, పరీక్షకు అవసరమైన పేపర్లను తామే అందజేస్తామన్నారు. ఉదయం 9 గంటలకు రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఒకప్పుడు భారతదేశం ప్రపంచ శక్తిగా వెలిగిందని, భవిష్యత్తులో మళ్లీ ఆ స్థాయికి ఎదగగలదా.. అది ఎలా అనే అంశంపై యువతులు, మహిళలు ప్రసంగించాల్సి ఉంటుందన్నారు. సాయంత్రం 3 గంటలకు నేటి సామాజిక మాధ్యమాలు.. మానవునికి వరమా? శాపమా? అనే అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుందని తెలిపారు. పోటీదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 94406 51284 ఫోన్ నంబరులో సంప్రదించాలని వివరించారు.

ఖేలో ఇండియా సిబ్బందికి వీడ్కోలు



పదోన్నతిపై వెళ్తున్న వారితో వైఎస్సార్ క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

కడప స్పోర్ట్స్: కడప నగరం వైఎస్సార్ క్రీడా పాఠశాలలో పని చేస్తూ పదోన్నతిపై వెళ్తున్న ఖేలో ఇండియా స్టేట్ ఎక్స్‌లెన్స్ సెంటర్ సిబ్బందికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో న్యూట్రీషియనిస్టుగా పని చేస్తున్న కె.శరణ్య పంజాబ్ రాష్ట్రం పటియాలలోని ఎన్‌ఎస్‌ఎన్‌ఐఎస్‌కు, ఫిజియోథెరపిస్టు మహమ్మద్ జునైద్ వాహీద్ బెంగళూరులోని సాయ్ సెంటర్‌కు పదోన్నతిపై వెళ్లారు. వారికి శుక్రవారం కడప నగరంలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రశాఖ పిలుపు మేరకు కడప జోనల్ మెంబర్ ప్రమీల, జిల్లా కార్యదర్శి రామమూర్తి, కోశాధికారి ఎ.ఎస్.రెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శుక్రవారం కోడి పందేలు ఆడుతున్న సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో స్థావరంపై దాడి చేశారు. పందేలు ఆడుతున్న వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1500 నగదుతో పాటు ఐదు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

కమలాపురం : ఈనెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ నారాయణరెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో పట్టభద్రులకు ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కడపలో యూటీఎఫ్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్, డీఈఓ కారాల్యయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగార్జునరెడ్డి, ట్రెజరర్ దావుద్దీన్, జిల్లా కార్యదర్శులు మస్తానయ్య, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, మురళీకృష్ణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ నరసింహారావు, నాయకులు గోపినాథ్, చెన్నయ్య, సుజిత్ వెంకటసుబ్బయ్య, శశి, శివశంకర్, సూర్యకుమార్, శివప్రసాద్, కరీముల్లా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బధిర మహిళా దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ ద డెఫ్ ఉమెన్ వారు అంతర్జాతీయ బధిర మహిళా దినోత్సవాన్ని ఆదివారం కడప ఎర్రముక్కపల్లె ఎస్‌బీఐ పక్కన ఉన్న మానస ఇన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీఎఫ్‌డిబ్ల్యూ ఉమెన్ ప్రెసిడెంట్ ధరణికుమారి, జనరల్ సెక్రటరీ అరుణ తెలిపారు. ముఖ్య అతిథులుగా రవి ప్రకాష్ ఐపీఎస్ భార్య సుకన్య రవిప్రకాష్, ఏపీ దివ్యాంగుల చైర్మన్ కుమారి ముంతాజ్ పటాన్, సంఘ మిత్ర ఎస్‌ఎం సిరాజుద్దీన్, కేసీ పుల్లయ్య ఫౌండేషన్ చల్లా సుధారాణి, అసిస్టెంట్ డైరెక్టర్ నిజాముద్దీన్, ఐఈఆర్టీ యశోద పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బధిర మహిళలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చట్టాల అమలు లోపంతోనే పురోగతికి ఆటంకాలు



మాట్లాడుతున్న కవయిత్రి నీలవేణి

కడప ఎడ్యుకేషన్ : మహిళా చట్టాల అమలు సరిగా లేకపోవడంతోనే పురోగతికి ఆటంకాలు కలుగుతున్నాయని కవయిత్రి, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పేర్కొన్నారు. శుక్రవారం కడప కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్ జెండర్ ఈక్విటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా సాధికారత, సాంకేతిక మార్పు, విద్య, ఉపాధిలో విస్తృతమైన ఆర్థిక సామాజిక అసమానతలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రధానాచార్యులు వీఎస్‌ఎస్ మూర్తి, హెచ్‌అండ్‌ఎస్ డిపార్టమెంట్ విభాగాధిపతులు శ్రీవాణి, ఈసీఈ విభాగాధిపతులు హేమలత, ప్రోగ్రాం సమన్వయకర్తలు రాధా, షర్మిలభాను తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ మోడల్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలలో భాగంగా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు ఆయన తెలియజేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని పలు సమస్యలపై సీఐ ఎన్.వి నాగరాజుతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పలు సూచనలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వుంచి, అరికట్టాలని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా ఎవరైనా పాల్పడితే వారి పట్ల అప్రమత్తంగా వుండాలని అన్నారు. కళాశాలల వద్ద విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని వృద్ధుల ఆశ్రమాల్లో శుక్రవారం వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు పవన్, అనిష్, వంశీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మరో సభ్యుడు డీపీ కార్తీక్‌రెడ్డి నగర శివార్లలోని చౌడమ్మ, బృంద వృద్ధుల ఆశ్రమాల్లో తొలుత అన్నదానం చేసి అనంతరం వృద్ధ మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీను, ఫుడ్ టీమ్ ప్రతినిధి చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారిణికి అభినందన



శ్రీవిద్యను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి, కోచ్

కడప స్పోర్ట్స్: కాకినాడలో ఫిబ్రవరి 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన ఆలిండియా హాకీ సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్–2023లో ఏపీ జట్టుకు కడప వైఎస్సార్ క్రీడా పాఠశాల విద్యార్థిని టి.శ్రీవిద్య ప్రాతినిథ్యం వహించింది. ఏపీ సీనియర్ మహిళల జట్టుకు ఈమె ప్రాతినిథ్యం వహించడం పట్ల క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాకీ శిక్షకుడు కె.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ క్రిష్ణప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో బాలికా విద్యను ప్రోత్సహించాలని కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ క్రిష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం కడప చెమ్మియాపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు సౌజన్యంతో కెనరా విద్యాజ్యోతి పథకం కింద ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా బ్యాంకు విద్య తదితర విభాగాలలో పాలు పంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మేరీ, బ్యాంకు సిబ్బంది నరసింహ, పవన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం : మండలంలోని 11 కేవీ, 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా సీతారామ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని చీమలపెంట దళితవాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతారామస్వామి విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నూతన విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ తాడేపల్లి ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నందు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 24వ తేదీలోపు నెట్ సెంటర్ ద్వారా గాని, సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచిగాని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు ఎస్సీ, ఎస్టీలు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31లోగా జన్మించి ఉండాలన్నారు. అలాగే ఓసీ, బీసీ, ఎస్సీ కన్వెర్టెడ్ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. 2021–22లో 3వ తరగతి, 2022–23లో 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలన్నారు. కుటుంబం వార్షిక ఆదాయం రూ.1లక్ష మించి ఉండరాదన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 23వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామని ఆమె అందులో పేర్కొన్నారు.

ఆర్టీపీపీలో భద్రతకు ప్రాధాన్యం

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో శుక్రవారం భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్మికుడు భద్రతా పరికరాలు ధరించాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణ, సీనియర్ ఎస్‌ఈ దేవేంద్రనాయక్, ఎస్‌ఈ సోమశేఖరరెడ్డి, డీవైసీసీ రమణారావు, డీఈ ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిశీలన

ఎర్రగుంట్ల : స్థానిక రాణీవనంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.